నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 23, జూన్ 2024 పేజీలు: 04

## జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి

- రైతులకు సాగునీరు వదిలేందుకు అధికారులు పూర్తి అధికారాలను వినియోగించుకోవాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు

3



### అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా

# సమన్వయంతో పనిచేయాలి

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమశాఖా మాత్యులు సీతక్క



మహబూబాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-జూన్ 22: శనివారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధ్యక్షతన ముఖ్య అతిదిగా రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ శాసనసభ సభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్,ఇల్లందు ఎమ్మెల్యే కోరం మిగతా 2లో..



### ప్రతీ ఒక్కరూ ఒలంపిక్ రన్‌లో

# పాల్గొనాలి

- జంపన ప్రతాప్‌తో కలిసి జెర్సీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

నేటి ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సికింద్రాబాద్ జింఖానా మైదానం నుండి ఎల్బీ స్టేడియం వరకు కొనసాగే ఒలింపిక్ రన్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు మిగతా 2లో..




### ఇచ్చిన మాట నెరవేర్చడమే

# కాంగ్రెస్ నైజం..

- రైతుల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ..
- జూలై 15 నాటికి రైతులకు రుణమాఫీ
- బల్మూరు మండలానికి సాగునీరు అందించే దిశగా అడుగులు
- పోడు భూములపై ప్రత్యేక దృష్టి, అర్హులైన వారికి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం
- కేబినెట్లో రైతుల రుణమాఫీ పై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

వివరాలు 02లో..





# ఇచ్చిన మాట నెరవేర్చడమే కాంగ్రెస్ నైజం

**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్న్యూస్)- చారకొండ వెంకటేష్, జూన్ 22:**

ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చడమే కాంగ్రెస్ నైజం అని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ..... శుక్రవారం కేబినెట్లో రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి కీలక నిర్ణయం తీసుకోవడం ఎంతో హర్షించదగ్గ విషయమని ఈ సందర్భంగా అన్నారు. అధికారంలో ఉంటే ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చుకుంటూ ప్రజల పక్షాన నిలబడుతూ.. ప్రజాసేవకే అంకితం అవుతూ.. కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను తూచా తప్పకుండా ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుంది అన్నారు. వచ్చేనెల జూలై 15వ. తేదీ తర్వాత రైతు రుణమాఫీ రూ. 2 లక్షలు ఒకే జఫాగా మాఫీ అవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఒకేసారి రూ. 2 లక్షల రూపాయలను మాఫీ చేయడం గర్వించదగ్గ విషయము అన్నారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెల్లలోపే రుణమాఫీ చేశామన్నారు. రైతు రుణమాఫీ కోసం రూ. 31 వేల కోట్లు అవసరమని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం లో కెసిఆర్ సీఎంగా ఉన్నప్పుడు రెండుసార్లు రుణమాఫీ చేసి కూడా రూ. 28 వేల కోట్లు మాత్రమే చేశారన్నారు. మాజీ కాంగ్రెస్ పార్టీ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు 2006 – 07 సంవత్సరంలో ఒకేసారి రూ. 13వేల కోట్లు రుణమాఫీ కాంగ్రెస్ పార్టీ హయాంలో చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రానున్న రెండు సంవత్సరాల్లో బల్మూరు మండలానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు ఫేస్ 1, ఫేస్ 2 ద్వారా పకడ్బందీ ప్రణాళికలతో కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందన్నారు. పోడు భూములు కాంగ్రెస్ పార్టీ అర్హులైన ప్రతి ఒక్కరికి భూములు దక్కేలా పకడ్బందీతి హూఅత్మకంగా అడుగులు ముందుకేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియమ్మ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి హయంలో తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు వెళ్లే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తు, ఇచ్చిన ప్రతి మాటను తీర్చేందుకు ముందుకు సాగుతుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీలను అమలుపరుస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ, సుందిళ్ల,అన్నారం బ్యారేజీలు పూర్తిగా నాణ్యత లోపం ఏర్పడిందని తెలిపారు. మాట తప్పదు.. మడమ తిప్పదు... అన్న విధంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ పార్టీ శ్రీనివాసులు, నాయకులు మాధవరెడ్డి, అంతటి మల్లేష్, కాశన్న యాదవ్, రాంప్రసాద్ గౌడ్ లతోపాటు మరి కొంతమంది నాయకులు పాల్గొన్నారు.



# అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలి





(మొదటిపేజీ తరువాయి..)

కనకయ్య, మునిసిపల్ చైర్ పర్సన్ డాక్టర్ పాల్వాయి రాం మెహన్ రెడ్డి లతో కలిసి సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా సమీక్షలు నిర్వహించి, టార్గెట్ లను నిర్దేశించుకొని పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు న్యాయంగా లబ్ధిదారులకు అందేలా, స్మార్ట్ గా ఆలోచించి టెక్నీకల్ గా పనిచేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ఉత్తమ విద్యను అందించే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో మత్తు పదార్థాల పై అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో ఐ.టి.డి.ఏ పరిధిలోని మండలం కేంద్రాలలో గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలో ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలలో చుట్టు పరిసరాల పరిశుభ్రత పై దృష్టి సారించాలని, రోజు వారీగా హాస్టళ్లను తనిఖీ చేయాలని , అదేవిధంగా ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించి విద్యాబోధన, నాణ్యమైన భోజనం అందించాలని, సరకుల అక్రమ రవాణా జరుగకుండా కఠినంగా వ్యవహరించి అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నకిలీ విత్తనాలపై దృష్టి సారించి జిల్లాలోని టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, ఎరువుల, విత్తనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా సాంక్షన్ అయి ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, ఎక్కువగా పెండింగ్ ఉన్న పనులలో కాంట్రాక్టర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. కల్వర్టు నిర్మాణ పనులకు ఆటంకం కలుగకుండా ఫారెస్టు డిపార్ట్మెంట్ సమన్వయం తో పనుల పూర్తికి సహకరించాలని అన్నారు. సంక్షేమ శాఖ ద్వారా అంగన్వాడీ పాఠశాలల్లో పరిశుభ్ర వాతావరణం, నాణ్యమైన ఆహారం పిల్లలకు అందించాలని, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల ద్వారా మొక్కలు అందుబాటులో ఉంచుకొని, గ్రామానికి చివరలో పండ్ల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం మహిళా సంఘాలకు ప్రభుత్వం ద్వారా ఆమోదించిన యూనిట్లకు బెనిఫిషరీస్ గుర్తింపు త్వరగా జరగాలని అన్నారు. జిల్లాలో మహిళా క్యా%శీ%టీన్ లను ప్రారంభించడానికి అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. మహిళల ఆర్ధికాభివృద్ధికి తోడ్పడేందుకు వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అధికారులు అందించాలన్నారు.

జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, నిరంతరం గస్తీ నిర్వహించాలని, గంజాయి కేంద్రాలను గుర్తించాలని అన్నారు. చిన్న పిల్లలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పోలీసు అధికారులకు సూచించారు.

ఎం.పి పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ గ్రామాలలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గవర్నమెంట్ దవాఖాన కు వచ్చే రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, డాక్టర్లు పేషేంట్లకు జబ్బులకు తగ్గట్టుగా మందులుగాని, ట్రీట్మెంట్ గాని ఇవ్వాలని మోతాదుకు మించి డోసు ఇవ్వకూడదని అన్నారు. అధికారులు స్కానింగ్ సెంటర్ల పై నిఘా పెట్టాలని, తనిఖీలు నిర్వహించాలని, మేల్, ఫీమేల్ నిష్పత్తి పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు.

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాలో ట్రాన్స్కో అధికారులు వ్రేలాడే కరెంటు తీగలను సరిచేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ప్రమాదవశాత్తు జరిగే మరణాలను నివారించాలని, నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా కు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఏమేమి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో అవగాహన కల్పించాలని, భూ పరీక్షల నమూనాలను సేకరించాలని అన్నారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి స్కీం ఎక్కువ మందికి లబ్దిచేకూరేలా చూడాలని మంత్రిని కోరారు.

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూఅధికారులు సామాజిక భాద్యతో పనిచేయాలని విద్య, వైద్యంపై నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చాలన్నారు. రౌడీ షీటర్లపై, భూకబ్జా దారులపై ఉక్కుపాదం మోపాలని, ప్రత్యేక శ్రద్ధ వహించి జిల్లా లో క్రైమ్ రేటును తగ్గించాలని అన్నారు.

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ గ్రామాల్లో నర్సరీలలో ఉన్నటువంటి పండ్ల మొక్కలు నాటే విధంగా చర్యలు చేపట్టాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామ అవసరాలకు ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అవసమైన పనులను చేపట్టాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి గ్రామానికి అవసరమైన పనులను ఆమోదించి పనిచేయాలని అన్నారు. జిల్లాలో సికిల్ సెల్ వ్యాధి బారిన పడిన వారిని ప్రత్యేక దృష్టితో తగు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన పరచాలని అన్నారు. గ్రామాల్లో క్యా%శీ%పు లను నిర్వహించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. వైద్యులు హాస్టళ్లను తనిఖీ చేసి విద్యార్థులకు ఆరోగ్య పరమైన పలు సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు.

ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. గ్రామాలలో వర్షాకాల ప్రభావం వలన ప్రజలు జబ్బుల బారిన పడకుండా అధికారులు త్రాగునీరు, పరిశుభ్రతపై ద్రుష్టి సారించాలని మండల వైద్య కేంద్రాలలో ఎప్పటికప్పుడు అవసరమైన మందులు అందుబాటులో ఉండే విధంగా వైద్యాధికారులు చూసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా లోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల చదువుపట్ల ప్రత్యేక దృష్టి సారించామని, ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని మౌలికమైన,వసతులతో కూడిన విద్యా బోధన, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, జిల్లాలో పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమంగా వచ్చాయని, అదే విధంగా పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగిందని, మహిళల ఆర్థిక అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించామని, అంగన్ వాడీ లు, నర్సరీలలో పండ్ల చెట్లను పెంచేలా చర్యలు తీసుకుంటామని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించడం జరిగిందని, గ్రామాలలో ప్రత్యేక అధికారులతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో డి.ఎఫ్.ఓ బత్తిని విశాల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జెడ్పీ ఇంచార్జి సీ.ఈ.ఓ నర్మద, పంచాయతీ రాజ్ ఎస్.ఈ సురేష్ వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు ఒలింపిక్ రన్‌లో పాల్గొనాలి

(మొదటిపేజీ తరువాయి..)

జంపన ప్రతాప్ కోరారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఈ రన్ స్టార్ట్ అవుతుందని తెలిపారు. ఒలింపిక్ రన్ సందర్భంగా కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, జంపన్న ప్రతాప్, అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే శ్రీ గణేష్ జెర్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... శారీరక దృఢంగా ఉండాలంటే ప్రతి రోజు వాయమం ఎంతో అవసరమని, ఆదివారం నాడు జరిగే ఒలంపిక్ డే రన్ లో ప్రతి ఒక్కరు పాల్గొనరని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ వెటరన్ అథ్లెట్ పలు మార్లు ఒలింపిక్ రన్ విజేత మర్రి లక్ష్మణ్ రెడ్డి, వివిధ క్రీడాకారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఈ రన్ లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికై
# పాదయాత్ర

- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తాం..
- బస్తి మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్..

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 22:**

ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయంగా పనిచేస్తానని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు. శనివారం రెండో వార్డులోని కృష్ణా నగర్, కట్ట మైసమ్మ బస్తీలో వాంబే గృహ సముదాయాలలో, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముప్పిడి గోపాల్, రెండోవ వార్డు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శాంసన్ రాజు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, శాంసన్ రాజు, బస్తి నాయకులు ఆంజనేయులు శ్రీనివాస్ లతో కలసి ఎమ్మెల్యే శ్రీ గణేష్ పాదయాత్ర చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బస్తీలోని నివాసాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, స్లాబులు ఊడిపడుతూ స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే బస్తీలో తాగునీటి సరఫరా సమయం పెంచాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతోపాటు విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఇళ్ల మధ్య నుంచే వేలాడుతున్నాయని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సమంత అధికారులకు ఫోన్ చేసే సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ... బస్తీ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. 6 గ్యారంటీలకు సంబంధించి అర్హులందరికీ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బస్తీ నేతలు మహావీర్, జిలాని, మహిళలు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్‌కి ఘన సన్మానం

- బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి ఘన సన్మానం చేశారు. వనపర్తి జిల్లాకు నూతనంగా వచ్చిన సందర్భంగా గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఆయనను కలిసి పలు సమస్యలు వివరించారు. ప్రైవేటు స్కూళ్లలో దోపిడీని నిలువరించాలని గిరిజన ఆశ్రమ పాఠశాలలపై దృష్టి సారించి విద్యా వైద్యాన్ని మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో సంతోష్ నాయక్ రాకేష్ నాయక్ సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి





**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ రైతాంగానికి సాగునీటిని వదిలే విషయంలో అధికారులు పూర్తి అధికారాలను వినియోగించుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి తో కలిసి విద్యా, వైద్య, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు

**విద్యా శాఖ..:** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ విధులకు సమయానికి హాజరు కావాలని, ఉపాధ్యాయుల హాజరుపై జిల్లా విద్యాధికారి, లేదా మండల విద్యాధికారి తప్పనిసరిగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు సకాలంలో పంపిణీ చేయాలని, వీటి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద ఎంపికైన అన్ని పాఠశాలల్లో పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ఆధికారులకు, ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు.

**విద్యుత్..:** జిల్లాలో పెండింగ్ లో ఉన్న సబ్ స్టేషనలపై విద్యుత్ అధికారులతో మంత్రి ఆరా తీశారు. 2017-18 లో శాంక్షన్స్ పూర్తి అయి నేటికీ ప్రారంభనికి నోచుకోకపోవడానికి గల కారణాలపై అధికారులను ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ (రైట్ అఫ్ ఏ) అభ్యంతరాల కారణంగా పనులు ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. మొత్తం జిల్లాలో 13 సబ్ స్టేషన్లు కొత్తవి మంజూరు కాగా 6 సబ్ స్టేషన్లకు పని నడుస్తోందని, 4 సబ్ స్టేషన్లకు పనులకు టెండర్లు పిలిచే దశలో ఉన్నాయని, ఇంకా రెండు సైట్స్ హ్యాండ్ ఓవర్ దశలో ఉన్నాయని, మరొకటి న్యాయస్థానంలో కేసులో ఉందన్నారు. గృహజ్యోతి కింద జిల్లాలో కేవలం 63 వేల మందికి మాత్రమే లబ్ది జరిగిందని, మిగతా వారి పరిస్థితి ఏంటని మంత్రి ప్రశ్నించారు. దానికి అధికారి స్పందిస్తూ ప్రజాపాలన లో దరఖాస్తుల్లో సమస్యలు కారణంగా ఆలస్యం అవుతోందని చెప్పారు.

**వైద్యాధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి: మేఘా రెడ్డి**

ఆస్పత్రులకు అత్యవసర సేవల కోసం వచ్చే బాధితులకు రిఫర్ చేసే సంస్కృతికి వైద్యాధికారులు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. అత్యవసరంగా ఆస్పత్రులకు వచ్చే వారికి వేగంగా చికిత్స అందించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల విషయంలో సిబ్బంది ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించడానికి వీల్లేదని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి, శిశు మరణాలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అంతేకాకుండా వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రల్లో ఉన్న విలువైన చికిత్స పరికరాలను సక్రమంగా నిర్వహణ చేసుకోవాలని, నిరూపయోగంగా ఉన్న వాటిని ఉపయోగంలోకి తేవాలని చెప్పారు.

**నీటి పారుదల..:** జిల్లాలోని రైతులకు సాగునీరు ఇవ్వడానికి అధికారులు తమకు ఉన్న పూర్తి అధికారాలను ఉపయోగించుకోవాలని మంత్రి చెప్పారు. కాలువల్లో జమ్ము ఉండడానికి వీల్లేదని, వెంటనే డీ సెల్టింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఇక ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 70 మినీ లిఫ్ట్ లలో మోటార్లు పని చేయడం లేదని దృష్టికి వచ్చిందని వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులతో శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును పంటకాలం చివరి వరకు భద్రపరుచుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారిణి ముండ్లపాటి విజయనిర్మల

**(నేటి ఫోకస్ న్యూస్) ప్రతినిధి మాగి ముఖేష్,బోనకల్లు జూన్ 22:**

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో పత్తి మరియు జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శనలో రైతులకు తగు సూచనలు, సలహాలు తెలియజేసారు. పత్తి సాగుకి నేలలో తగిన పదును వున్నప్పుడు మాత్రమే విత్తుకోవాలి. 60 మి. మీ వర్షపాతం నమోదు అయినప్పుడే పత్తి సాగుకి నేల అనుకూలంగా ఉంటుంది. అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదు పొందాలి. విత్తన కొనుగోలు రశీదును మరియు విత్తన ప్యాకెట్ ను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి అని పేర్కొన్నారు. రశీదును భద్రపరుచుకోవడం ద్వారా జన్యుస్వచ్ఛత లోపాల వల్ల లేదా మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుంది. పచ్చిరొట్ట పైర్లు జనుము, మరియు జీలుగ సాగు ద్వారా నేల సారాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువులపై పెట్టె పెట్టుబడి ఖర్చు కొంతమేర తగ్గించవచ్చు. పచ్చిరొట్ట పైర్లు సాగు ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను నిరోధించి, నేల భౌతిక స్థితి మెరుగుపడి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.. వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసే పంటల నమోదు ద్వారా భవిష్యత్ లో పంటల కొనుగోలు, పంటల సాగు లెక్క ఖచ్చితత్వం, ఎరువుల సరఫరా మరియు ప్రభుత్వ పథకాల అమలుకు ప్రామాణికంగా నిలుస్తుంది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సర్వసుద్ధి సరితా, వ్యవసాయ విస్తరణ అధికారి బద్దల కార్తీక్ మరియు రైతులు పాల్గొన్నారు.





# శ్రీశ్రీ దండు మారమ్మ ఆలయంలో పూజలు

- దుర్గ రవి కుమార్ ఆధ్వర్యంలో అన్నదానం
- ఈసారి తనకు అన్నదానం చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది: దుర్గా రవికుమార్





**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూన్ 22:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలో పున్నం సందర్భంగా, శ్రీ శ్రీ దేవి దండు మారెమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలుతో పాటు అన్నదాన కార్యక్రమని నిర్వహించామని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దేవాలయ ధర్మకర్త ముప్పిడి గోపాల్ తెలిపారు. శనివారం నాడు దండు మారెమ్మ ఆలయంలో అన్నదానం దాతగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, దళిత రత్న అవార్డు గ్రహీత దుర్గా రవికుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా దుర్గా రవికుమార్ మాట్లాడుతూ... శ్రీ దండు మారెమ్మ ఆలయంలో ప్రతి పున్నం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈసారి అన్నదానం చేయడం మా కుటుంబానికి దక్కినందుకు సంతోషంగా ఉందని, ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం హెూమాలతో పూజలు చేసిన అనంతరం, ముప్పిడి గోపాల్ తో కలిసి భక్తులకు అన్న ప్రసాదం ప్రారంభం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఈ.వో రవికాంత్, సైదులు, దుర్గా రవి కుమార్ కుటుంబ సభ్యులు ఉమాదేవి, కస్తూరిబాయ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శాంసన్ రాజు, రమేష్, రవి, వెంకటేష్, శ్రీకాంత్, స్థానిక మహిళలు భాగ్య, కళ్యాణి, రచిత, బృంద తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉదారత చాటిన ప్రముఖ వేద పండితులు జోషి గోపాల శర్మ

- సోలిపూర్ ప్రభుత్వ పాఠశాలకు టేబుల్స్ వితరణ
- అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

ప్రముఖ వేద పండితులు జోషి గోపాల శర్మ ప్రభుత్వ పాఠశాలకు టేబుల్స్ వితరణ చేసి తన ఉదారతను చాటుకున్నారు. ఖిల్లా గణపురం మండలంలోని తన స్వగ్రామమైన సోలిపూర్ ప్రభుత్వ పాఠశాలకు తన సొంత డబ్బులతో తయారు చేయించిన 10 టేబుల్స్‌ను శనివారం పాఠశాల ఉపాధ్యాయులకు వితరణ చేశారు. ప్రస్తుతం ఆయన వనపర్తి లో నివాసం ఉంటున్నప్పటికీ పుట్టి పెరిగిన గ్రామమైన సోలిపూర్‌ను మరిచిపోవడం లేదు. అక్కడ ప్రసిద్ధిగాంచిన ఆలయంలో ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు జరపడంలో ఆయన ముందుంటారు. తన గ్రామా నికి ఏదైనా సేవ చేయాలనే తపనతో పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలకు బెంచీలు చేయించి ఇవ్వడంతో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు ఆయనను అభినందించి ప్రత్యేక సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు ప్రముఖ సామాజికవేత్త పోచా రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



# పేద, మధ్యతరగతి ప్రజలతో ఆడుకుంటున్న వ్యాపారస్తులు

- గాజులు, కుడుకలు మార్పిడి చేసుకోకుంటే కీడు అని ప్రచారం చేస్తున్న కిలాడీలు

**నేటి ఫోకస్ న్యూస్, వేములపల్లి(నల్లగొండ బ్యూరో)-జూన్ 22:**

గ్రామీణ ప్రాంతాలలోని చిన్న సన్నకారు వ్యాపారస్తులు తన వ్యాపార స్వలాభం కోసం పేద మరియు మధ్య తరగతి ప్రజలను మభ్యపెడుతూ తన వ్యాపారాన్ని పెంపొందించుకోవడానికి రకరకాల మూఢనమ్మకాలను వారికి అంటగడుతూ ప్రచారం చేసుకుంటున్నారు అందులో భాగమే వదిన మరదళ్ల గాజులు,మనుమన్లు,మనమరాలకు పెట్టే కుడకలు, అక్కాచెల్లెళ్ల గాజుల మార్పిడి కార్యక్రమం జోరుగా పల్లె గ్రామీణ ప్రాంతాల్లో జోరందుకున్నాయి .ఇలాంటి పూకార్లు పేద మధ్యతరగతి వారికి ఎందుకు అంటగడుతున్నారని ఆలోచిస్తే సంవత్సరంలోని జనవరి నుండి మార్చి వరకే పండగల సందడి ఉండడం మార్చి చివరి నుండి ఆగస్టు వరకు ఎలాంటి పండుగ కార్యక్రమాలు ఉండకపోవడంతో వ్యాపారస్తులు తన వ్యాపార స్వలాభం కోసం ఇలాంటి పూకార్లు సృష్టించి తన వ్యాపారాలను అభివృద్ధి పరచుకోవడానికి ప్రచారం నిర్వహించడం జరుగుతుంది. ఇలాంటివి గ్రహించకుండా ఏదో జరిగిపోతుందని ఊహించుకొని అప్పు,సొప్పు చేసుకొని నష్టపోతున్నారు పేద ప్రజలు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు, జన విజ్ఞాన వేదిక సభ్యులు ఇలాంటి మూఢనమ్మకాలపై ప్రజలలో అవగాహన కల్పించి ప్రజలలో చైతన్యం తేవాలని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.



# సీఎం రేవంత్‌ను కలిసిన గోనూరు రాజు

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**



వనపర్తి పట్టణానికి చెందిన బులియన్ మర్చంట్ మాజీ పట్టణ అధ్యక్షులు గోనూరు రాజు శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్యవైశ్యులను గుర్తించి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రేవంత్ మిత్రమండలి జిల్లా అధ్యక్షులు గౌని వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయనను కలిసి ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నుంచి ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే గారూ అపనిందలు ఆపి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- బిఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై అపనిందలు ఆపి అభివృద్ధిపై దృష్టి సారించాలని బిఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఎమ్మెల్యే మేఘారెడ్డికి హితవు పలికారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడు నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కోసం నిధులు తేలేని మీరు ప్రజల దృష్టి మరల్చుడానికి నిరంజన్ రెడ్డి పై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటినుండి బొంద పెడతాం, పాతి పెడతాం, కర్రు కాల్చి వాత పెడతాం, అంతు చూస్తాం, జైలుకు పంపుతాం అంటూ వేదికలపై చప్పట్లు, ఈలలు వేయించుకొని సంబరపడడం మాని విచారణ చేయించుకోవచ్చని సూచించారు. నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా నిరంజన్ రెడ్డి వందల కోట్ల రూపాయలు మంజూరు చేయించి లక్ష ఎకరాలకు సాగునీరు, రోడ్ల విస్తరణ, చెరువుల మరమ్మతులు, వనపర్తి జిల్లా ఏర్పాటు, మెడికల్ కళాశాల, జె ఎన్ టి యు, టౌన్ హాల్, మార్కెట్ యార్డు, సమీకృత మార్కెట్ యార్డు, ఏదుల రిజర్వాయర్ వంటి శాశ్వత పనులు చేపట్టి చరిత్రలో నిలిచిపోయారని గుర్తు చేశారు. గత శాసనసభ సభ్యులు అభివృద్ధి కోసం ఆరోగ్యకరమైన పోటీ పెట్టుకుని ఒకరిని మించి ఒకరు అభివృద్ధి చేశారని అదృష్టం కలిసి వచ్చి మీరు ఎమ్మెల్యే కాగలిగారని అన్నారు. ప్రజల తీర్పు గౌరవిస్తూ గత పాలకులను మరిపించే విధంగా అభివృద్ధి చేస్తారని ఆశించిన ప్రజలకు అవగాహన లేక ఏమి చేయాలో తోయక నిత్యం నిరంజన్ రెడ్డిని నిందించడానికి పూనుకున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో అవినీతి జరిగితే సిబిఐ, ఈడి వంటి విచారణ చేసే ఏజెన్సీ లతో ఎంక్వైరీ చేయించి చర్యలు తీసుకోవాలి కానీ ప్రజలను మభ్యపెట్టడానికి రోజుకో ప్రకటన చేస్తూ మీ చేతకానితనంతో ప్రజలలో చులకన కావద్దని హితవు పలికారు.

